నరసాపురంలో అభివృద్ధి పనుల జోరు

- రూ.3.37 కోట్లు నిధులతో రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి పనులు

నరసాపురం: మున్సిపాలిటీలో పలు వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల పనులు జోరుగా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్లు నిర్మాణాలు ముగింపు దశకు వచ్చాయి. పలు ప్రధానమైన రహదారులు, డ్రెయిన్స్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వేసవి ముగిసే లోపు పెండింగ్ పనులు పూర్తి చేసే విషయంలో అధికారులు దృష్టి పెట్టారు. దీంతో కీలకమైన ప్రాంతాల్లో, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్స్‌కు కొత్తరూపు వచ్చినట్టయ్యింది. ముఖ్యంగా ఇటీవల కాలంలో జనరల్ ఫండ్స్‌ను పెద్ద ఎత్తున ఖర్చుచేస్తూ అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపాలిటీ, తాజాగా 14వ ఆర్థికసంఘం నిధులతో వేసవిలో పూర్తిగా రోడ్లు, డ్రెయిన్స్ నిర్మించాలని తలపెట్టింది. వెంటనే టెండర్లు పిలిచి గత ఏడాది పనులు మొదలు పెట్టారు. స్టేషన్‌పేట, గ్రేస్ నగర్, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు శిథిలం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల డ్రెయిన్స్ కూడా శిథిలమయ్యాయి. దీంతో ప్రధానంగా 14వ ఆర్థికసంఘం నిధులను ఈ ప్రాంతాల్లో వెచ్చించి రోడ్లు, డ్రెయిన్స్ పనులు చేపట్టారు. .


స్టేషన్‌పేట వద్ద రైల్వేస్టేషన్ సమీపంలో పూర్తి చేసిన సీసీరోడ్డు, కెనాల్ సపోర్టింగ్ వాల్ పనులు

రూ.3.37 కోట్లతో..

పట్టణంలో మొత్తం రూ.3.37 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర క్రితం స్టేషన్‌పేట ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వెనుక చినమామిడిపల్లి మీదుగా రైల్వేగేట్ సమస్యకు పరిష్కారంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. అయితే ఇప్పుడు ఈ బైపాస్‌రోడ్డుకు అనుసంధానంగా స్టేషన్‌పేటలో ఉన్న రోడ్డును 14వ ఆర్థిక సంఘం నిధులతో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి చేశారు. రూ.1.05 కోట్లతో సీసీ రోడ్డు, కెనాల్ పక్కన సపోర్టింగ్ వాల్ నిర్మించారు. సుమారు 30 గ్రామాల వారు ఇటుగా ప్రయాణిస్తారు. వీరందరికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా మారింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్టేషన్‌పేట నుంచి గ్రేస్ నగర్ వరకూ రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. 22వ వార్డులో రూ.42 లక్షలతో సీసీరోడ్డు, ఎన్టీఆర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు, 2వ వార్డులో రూ.28 లక్షలతో సీసీరోడ్డు, డ్రెయిన్, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్, 1వ వార్డు శ్రీహరిపేటలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు పనులు పూర్తికావచ్చాయి. ఈ రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజల రవాణా ఇబ్బందులు పూర్తిగా తీరనున్నాయి.

రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టి



పట్టణంలోని వార్డుల్లో చాలా కాలంగా రోడ్లు, డ్రెయిన్స్ శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు గమనించి ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాం. చేపట్టిన పనులు చాలా వరకూ పూర్తయ్యాయి. పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


కొప్పర్రులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తనయుడు, అల్లుడు.

నరసాపురం రూరల్: నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మరోమారు గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని కొప్పర్రు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజుతో పాటు ప్రసాదరాజు అల్లుడు అనిర్విన్ల ఇరువురు కూడా గడప గడపకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించడానికి ప్రతీ ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేస్తే ప్రజలకు మరింత సంక్షేమం చేకూరుతుందన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా ముదునూరి ప్రసాదరాజును, ఎంపీగా గూడూరి ఉమాబాలను భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురువేద్దామన్నారు. కార్యక్రమంలో చినమిల్లి నర్సింహరావు (బాబులు), పోలిశెట్టి మధు, అందే కవికుమార్, సర్పంచ్ నల్లి వరలక్ష్మి, రావి బ్రహ్మజీ, పోలిశెట్టి గోపీనాద్, పాకా వెంకయ్య, ఇంజేటి నర్సింహరావు, రాబర్ట్, పిట్టా సూర్యప్రకాశరావు యాదంరెడ్డి సూరిబాబు, పోలిశెట్టి బాబా, పాకా బర్రం పాల్గొన్నారు.

కుంచనపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. మొత్తం నాలుగు టీమ్‌లో టోర్నమెంట్‌లో పాల్గొనగా, రెండు టీమ్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌లో రమేష్ టీమ్, నవీన్ టీమ్‌లు తలపడ్డాయి. ఈ పోటీలో రమేష్ టీమ్ విజయం సాధించగా, నవీన్ టీమ్ రన్నర్‌గా నిలిచిందని జైభీమ్ యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు. విజేతలకు అంబేద్కర్ జయంతి రోజున బహుమతులు అందజేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

క్లుప్తంగా

ఎండ వేడితో ప్రజల బెంబేలు


సాయంత్రం 5 గంటలకు కూడా నిర్మానుష్యంగా ఉన్న స్టీమర్ రోడ్డు

నరసాపురం రూరల్: ఓ పక్క ఉక్కపోత, విపరీతమైన ఎండలతో జనం అల్లాడి పోతున్నారు. గత రెండు రోజులుగా వాతావరణంలోని మార్పులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతుంది. మంగళవారం పగటిపూట ఎండ విపరీతంగా ఉండటంతో సాయంత్రం వేళల్లో భరించలేని ఉక్కబోతతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గాలిలో విపరీతంగా తేమ శాతం పెరగడంతో శరీరమంతా జిడ్డుగా తయారవడంతో ఉక్కపోత తట్టుకోలేకపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీచిన వేడి గాలులతో ప్రజలు అల్లాడిపోయారు. రహదారులు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. ఇప్పుడే ఎండ వేడి విపరీతంగా ఉండడంతో రాబోయే రోజులు ఎలా ఉంటాయో? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డాక్టర్ బాలచందర్‌కు ఉగాది పురస్కారం

పెనుగొండ: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ప్రముఖ సామితీ సంస్థ తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవిసమ్మేళనంలో పెనుగొండకు చెందిన కవి, రచయిత, గాయకుడు ఎస్వీకేపీ పితాని వెంకన్న జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ బాలచందర్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం ఈ మేరకు డాక్టర్ బాలచందర్ వివరాలను తెలిపారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పక్కి రవిశేఖర సత్యనారాయణ మూర్తి, మోటూరి నారాయణరావు, న్యాయ నిర్ణేత గౌరవ రాజు సతీష్‌కుమార్‌లు ఉత్తమ కవితను అందించినందుకు గానూ డాక్టర్ బాల చందర్‌ను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందించారనితెలిపారు.

వైభవంగా పల్లకి సేవ

భీమవరం (ప్రకాశం చౌక్): ఉగాది సందర్భంగా భీమవరం మెంటేవారితోటలోని బాల త్రిపుర సుందరిదేవి అమ్మవారికి 108 కలశాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో గొట్టుముక్కల వెంకటలక్ష్మి, నాయుడు నాగేంద్ర దంపతులు, కంచిరాజు వెంకటరావు, ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వేదమంత్రాలతో పూజ చేసి వివిధ రకాల పుష్పాలతో ఆలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి మెంటేవారి తోటలోని ప్రధాన వీధుల్లో 108 కలశాలతో అమ్మవారి ఉత్తవ విగ్రహంతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేద పండితులకు, అర్చకులకు ఉగాది పురస్కారాలు

భీమవరం (ప్రకాశంచౌక్): క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ చేతుల మీదుగా వేద పండితులు, అర్చకులకు సత్కారాలు నిర్వహించారు. గొల్లపల్లి వెంకట నాగ శ్రీరామ శర్మ అవధాని, అర్చకులు సుదర్శనం రాధాకృష్ణమాచార్యులు, మంచిలి విశ్వనాథ శర్మకు ఒక్కొక్కరికి రూ 10,116/- ల నగదు పురస్కారం, ప్రశంశా పత్రం, శాలువాలతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంకిత భావంతో ఆలయాలలో సేవలందిస్తున్న వీరిని ఉగాది పురస్కారాలతో సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈ. వెంకట సుబ్బారావు, భీమవరం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఆకివీడు: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం జగ్గయ్యపేటలో మహిళా కళాశాలలో చదువుతున్న యువతి సెలవుల నిమిత్తం తన అమ్మమ్మ గ్రామమైన గుమ్ములూరు వెళ్లేందుకు ఈ నెల 8వ తేదీన ఆకివీడు చేరుకుంది. రాత్రి 9.45 నిమిషాలకు గుమ్ములూరు వెళ్లేందుకు వాహనాల కోసం వేచి చూస్తున్న సమయంలో తన అమ్మమ్మ ఇంటి ప్రక్కన నివసించే రొయ్య వేణుగోపాల్ తన వాహనంపై తీసుకువెళతానని చెప్పి మోటారు సైకిల్ ఎక్కించుకుని మార్గమధ్యలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించేందుకు యత్నించాడు. దీంతో భయపడిన ఆమె మోటారుసైకిల్ నుంచి దూకేసి విషయం తన సోదరుడు, సోదరికి ఫోన్ చేసి తెలియజేసింది. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కోడిపందేలపై దాడి

మండలంలోని సిద్దాపురం గ్రామ శివారు కురుపాకలో కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు.

నేడు ఏనుగువానిలంకలో గోపి ప్రచారం

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) బుధవారం మధ్యాహ్నం నుంచి మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుచ్చిరాజు కోరారు.

రైల్వే ట్రాక్ పునర్నిర్మాణ పనుల ప్రారంభం

ఆకివీడు: బ్రాంచి రైల్వే లైన్‌లో పురాతన రైల్వే ట్రాక్‌ను తొలగించి, కొత్త ట్రాక్(పట్టా) పునర్నిర్మాణ పనుల్ని మంగళవారం ప్రారంభించారు. దీంతో స్థానిక సిద్ధాపురం రైల్వే గేటును ఈ నెల 12వ తేదీ వరకూ మూసివేశారు. డబుల్ రైల్వే లైన్ నిర్మాణం తో విజయవాడ-నిడదవోలు మధ్య గూడ్సు రైల్వే రాకపోకల సంఖ్య భారీగా పెరగడంతో బ్రిటీష్ కాలం నాటి రైలు పట్టాల్ని తొలగించే పనులను ముమ్మరం చేశారు.

రోగుల సేవలో శ్రీరంగనాథరాజు


గుంటూరు ఆసుపత్రిలో స్వయంగా వడ్డిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


గుంటూరు ఆసుపత్రిలో భోజనాలు చేస్తున్న రోగులు, వారి సహాయకులు

పెనుగొండ: ఉగాది పండుగను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు రోగుల సేవలో గడిపారు. క్రోధి నామ తెలుగు సంవత్సరాది సందర్భంగా గుంటూరులోని జీజీహెచ్ ఆసుపత్రిలో సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న భోజన శాలలో రోగులకు, వారి సహాయకులకు మంగళవారం స్వహస్తాలతో భోజనాలు అందించి సేవా తత్పరతను చాటుకొన్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీరంగనాథరాజును నియమించడంతో అప్పట్లో గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రిని సందర్శించి రోగుల సహాయకులు భోజనాలకు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. వెంటనే శ్రీరంగనాథరాజు సత్వరం స్పందించి రూ.కోట్లతో ఆసుపత్రి ఆవరణలోనే ఉన్న ఎన్జీవో హోంను భోజన శాలగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి నిత్యం ఉదయం, సాయంత్రం రెండుపూట్ల సుమారు 1500 మందికి భోజన శాలలో ఉచితంగా భోజనాలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు ఆచంట పరిసర ప్రాంతాల నుంచి వైద్యం నిమిత్తం గుంటూరు వెళ్లే రోగుల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి సేవలు సత్వరం పొందే విధంగా ఏర్పాట్లు సైతం చేశారు. రోగులు, వారి సహాయకులు ఉండేవిధంగా ఏర్పాట్లు చేసారు. ఎందరో శ్రీరంగనాథరాజు సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

స్వయంగా వడ్డించి.. బాగోగుల ఆరా

ఎన్నికల ప్రచారంలో బీజీగా ఉన్నా క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను రోగుల సేవలో గడపాలని మంగళవారం గుంటూరు వెళ్లి రోగుల సహాయకులకు, ఓపీకి వచ్చే రోగులకు స్వయంగా వడ్డించి భోజనం రుచిపై ఆరా తీశారు. అంతేగాకుండా రోగులకు అందుతున్న సేవలపై వైద్యులతో మాట్లాడి ఆరా తీశారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సేవాతత్పరతను పలువురు కొనియాడారు.

ఆలయాల వద్ద ఉగాది పంచాంగ శ్రవణం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ఆధ్యాత్మిక వేత్త కొత్తపల్లి వీర వెంకట సత్యనారాయణమూర్తి, రాజరాజేశ్వరి దంపతులను సత్కరించారు. ముందుగా సన్మాన గ్రహీత ఉగాది పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో పురోహిత సంఘ ఆధ్యక్షుడు మద్దూరి సూరిబాబు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఈరంకి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు సెంట్రల్: కొత్తపల్లి దంపతులను సత్కరిస్తున్న గాయత్రి స్మార్త పురోహిత సంఘ సభ్యులు

పెనుగొండలో..

పెనుగొండ: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ, బజారు రామాలయం, చెరుకువాడలోని అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం , పెనుగొండ చెరుకువాడ బ్రాహ్మణ సంఘంలోనూ రామడుగుల నరసింహమూర్తి పంచాంగ శ్రవణ నిర్వహించారు. శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలోనూ పంచాంగ శ్రవణ నిర్వహించారు. వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోనూ. సిద్ధాంతంలో పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేయగా, హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఆచంటలోని ఆచంటేశ్వర స్వామి ఆలయంలోనూ. కొడమంచిలిలోని వెంకటేశ్వర స్వామిఆలయంలోనూ ఉగాది వేడుకలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు.

పండితులకు ఉగాది సత్కారం

నరసాపురం రూరల్: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు కులమత, పేద, ధనిక బేధాలు లేకుండా నరసాపురం మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని అమ్మవార్లు, గ్రామదేవతల ఆలయాలకు భక్తులు చేరుకుని పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. నూతన సంవత్సరంలో కష్ట నష్టాలు లేకుండా ఆరోగ్యకరంగా ఉండేలా చూడాలని అమ్మవార్లను కోరుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో వాసవిక్లబ్, వనిత వాసవి క్లబ్‌లు సంయుక్తంగా గ్రామంలోని రాజగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ఆరవెల్లి జగన్నాధాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో పదిమంది పండితులను సత్కరించారు. వాసవిక్లబ్ వంకాయల వెంకటకుమార్, క్లబ్ సెక్రటరీ కోట్ల వెంకట అధ్యక్షులు శిరం బ్రహం, కార్యదర్శి కట్ల శ్రీరంగనాయకులు, కోట్ల వెంకట సత్యనారాయణ, జోన్-5 చైర్మన్ వంకాయల శ్యామల, వంకాలయ రవికుమార్, క్లబ్ సభ్యులు కంచర్ల సోని, కోట్ల సుధాకర్, పల్లపోతు రాము, పువ్వాడ బాబ్జి, గమిని శ్రీను, కోట్ల నాని, శిరం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో పంచాంగ శ్రవణం

మొగల్తూరు: శ్రీక్రోధి నామ సంవత్సరం అన్ని వర్గాల వారికి మంచి జరుగుతుందని ప్రముఖ పండితుడు కె.అచ్యుతరామారావు ప్రవచించారు. ఉగాది పండుగ నేపథ్యంలో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. నరసాపురం పట్టణానికి చెందిన వేద పండితుడు కె.అచ్యుత రామారావు మాట్లాడుతూ శ్రీ కోధి నామ సంవత్సర విశిష్టతను, రాశిఫలాలను భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులకు వేద ఆశ్వీరచనం అందించి పంచాంగాలను పంపిణీ చేశారు. మరోవైపు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చండీ హోమానికి గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ డి.రామకృష్ణంరాజు, మాజీ చైర్మన్‌లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ: సిద్ధాంతంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు


నరసాపురం రూరల్: తూర్పుతాళ్లు గ్రామంలో పండితులను సత్కరిస్తున్న దృశ్యం


మొగల్తూరు: ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న వేద పండితుడు

అంబేడ్కర్ ఆశయాలతో పని చేయాలి


ఆచంట వేమవరంలో నియామక పత్రాలు అందిస్తున్న పుష్పరాజ్

పెనుగొండ: ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయాలతో పనిచేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. మంగళవారం ఆచంట వేమవరం మాల మహానాడు కార్యాలయంలో పెనుమంట్ర మండల యువజన విభాగం అధ్యక్షులుగా గెడ్డం జాన్సన్, నెలమూరు గ్రామ గౌరవ అధ్యక్షుడిగా ఎడ్ల గంగరాజు, నెలమూరు గ్రామ అధ్యక్షుడిగా నేలపూడి సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల జూబ్లీ రాజు, ప్రధాన కార్యదర్శిగా సాక ఏసు, కార్యదర్శిగా పాలపర్తి వెంకట నరసయ్య, సహాయ కార్యదర్శిగా వీసా కోటి లాజరులను నియమించి నియమక పత్రాలు అందజేశారు.

గ్రామాల్లో ఉత్సాహంగా అమ్మవార్ల జాతరలు

పెనుగొండ: తెలుగు సంవత్సరాది ప్రారంభం కావడంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రామ దేవతల జాతర మహోత్సవాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామంలో శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారి ఆలయం వద్ద శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. చింతలపాలెం శెట్టిబలిజ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర మహోత్సవం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగల నృత్యాలు, సన్నాయి మేళాలు పలువురిని విశేషంగా ఆకర్షించాయి. ఈ జాతర లో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెనుగొండ దొంగగూడెం వాసులు పద్దాల వెంకమ్మ జాతర మహోత్సవం కన్నులపండువగా నిర్వహించుకున్నారు. ఆచంట మండలం భీమలాపురంలో ప్రసిద్ధి చెందిన గ్రామ దేవత గోగులమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు,బాణసంచా కాల్పులతో హోరెత్తించారు.


పెనుగొండ: ఆచంట మండలం భీమలాపురంలో పొన్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


పాలకొల్లు సెంట్రల్: పుంతలో ముసలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, నాగబాబు

పుంతలో ముసలమ్మ ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీరామ్‌పేటలో కొలువై ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, వైఎస్సార్ పార్టీ చింతలపూడి నియోజకవర్గం పరిశీలకులు గుణ్ణం నాగబాబులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఇరువురినీ శాలువతో సత్కరించారు. కమిటీ సభ్యులు మోర్త గిరీష్, బాకూరి సత్యనిరంజన్, బండి రమేష్, గేదెల నరసింహరావు, పెంటపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడవిపాలెంలో..

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి గ్రామానికి పడమర వైపున మంగళవారం రాత్రి తూర్పు వైపున ఘనంగా జరిగింది. ఊయల సేవ చేసి అమ్మవారిని బుధవారం ఆలయ ప్రవేశం చేయించడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా పుట్టినింటి తరపున వర్ధినీడి సత్యనారాయణమూర్తి-నాగలక్ష్మి, బెజవాడ సత్యనారాయణ-లక్ష్మీ దంపతులు అమ్మవారికి ఒడిగట్టు కింద తొలి పానకం కావిడి, సారె, చీర సమర్పించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, కానుకలు సమర్పించారు. అమ్మవారి మెట్టినింటి వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పెనుగొండ: సిద్ధాంతంలో ఆకట్టుకున్న విచిత్ర వేషధారణ